

కాంగ్రెస్‌లోకి గట్టు తిమ్మప్ప

- సీఎం రేవంత్‌రెడ్డితో సచివాలయంలో మర్యాదపూర్వక భేటీ
- పార్లమెంట్ ఎన్నికల్లోపే పార్టీలో చేరేందుకు ప్రణాళిక
- బోయలకు ఎమ్మెల్సీ ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ
- ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తామనీ వెల్లడి

గద్వాల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వినియోగదారుల సహకార ఫెడరేషన్ మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు సచివాలయంలోని సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆదివారం ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లోపే కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు తన అనుచరులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. తనకు రావాల్సిన కొన్ని పెండింగ్ బిల్లుల కోసం సచివాలయానికి వెళ్లిన తిమ్మప్పకు సలహాదారుల ద్వారా రేవంత్‌రెడ్డి నుంచి పిలుపు వచ్చినట్లు తెలిసింది. తనను కలిసిన తిమ్మప్పను సీఎం 'మామా బాగున్నావా' అని పలకరించి, కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆహ్వానించనట్లు ఆయన అనుచరులు తెలుపుతున్నారు. గట్టు తిమ్మప్ప ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న బోయ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు. గద్వాల మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడికి తమ్ముడిగా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఇప్పటివరకు గద్వాలలో గెలిచిన బీసీ నాయకుడిగా గట్టు భీముడికి పేరుంది. అప్పటికే బలమైన సామాజిక వర్గాల ఏలుబడిలో ఉన్న గద్వాలలో.. మొదటిసారి గట్టు భీముడు ఎమ్మెల్యేగా గెలవడంతో అక్కడ బీసీ వాదం బలం పుంజుకుంది. ఆ తర్వాత గట్టు భీముడు క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. ఆయన మరణానంతరం.. గట్టు తిమ్మప్ప రాజకీయాల్లో కీలకంగా ఉంటూ వస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గట్టు తిమ్మప్పను రాష్ట్ర వినియోగదారుల సహకార ఫెడరేషన్ చైర్మన్‌గా నియమించింది. గత ఎన్నికల సమయంలో కూడా ఆయన చైర్మన్ పోస్టులోనే ఉన్నారు. గద్వాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ చేరాలని నిర్ణయించుకోవడంతో బోయ సామాజిక వర్గంలోని మెజారిటీ సభ్యులు ఆయనతోపాటే నడిచే అవకాశం ఉంది.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గట్టు తిమ్మప్ప

ఎమ్మెల్సీ హామీ..

నడిగడ్డ ప్రాంతంతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో బోయ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉంటారు. మరీ ముఖ్యంగా నడిగడ్డ ప్రాంతంలో ఆ సంఖ్య మెజారిటీగా ఉంటుంది. గట్టు భీముడు తర్వాత క్రియాశీలకంగా రాజకీయాల్లో ఎవరూ పెద్దగా ఎదగలేకపోయారు. ఈ సామాజిక వర్గానికి చెందిన బల్గెర నారాయణరెడ్డి, బల్గెర శివారెడ్డి, బాసు హనుమంతునాయుడు క్రియాశీలకంగా ఉన్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో ఆశించిన పదవులు రాలేదు. గత ఎన్నికల సమయంలో బీజేపీ తరపున బల్గెర శివారెడ్డి పోటీ చేసినా.. రాజకీయ ఎత్తుగడలో భాగంగానే జరిగిందనే ప్రచారం ఉంది. అలాగే బల్గెర నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉండగా, టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాసు హనుమంతునాయుడు అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ నుంచి కూడా దరఖాస్తు చేసుకోగా.. ఎక్కడి నుంచీ టికెట్ దక్కలేదు. ప్రస్తుతం నారాయణరెడ్డి కాంగ్రెస్‌లో, హనుమంతునాయుడు, గట్టు తిమ్మప్ప బీఆర్ఎస్‌లో, శివారెడ్డి బీజేపీలో ఉన్నారు. గట్టు భీముడి భార్య ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. అయితే గతంలో బీఆర్ఎస్ పార్టీ వాల్మీకి బోయల నుంచి ఒకరికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇవ్వగా, దానికి బదులు గట్టు తిమ్మప్పకు వినియోగదారుల సహకార ఫెడరేషన్ చైర్మన్‌గా నామినేటెడ్ పోస్టు ఇచ్చింది. గత ఎన్నికల్లో ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చి బోయలను కేసీఆర్ మోసం చేశారని ఆ వర్గం నాయకులు అంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా ఎమ్మెల్సీ పదవి ఇస్తామని, అలాగే వాల్మీకులను బోయలు చేయాలని సూచించిన చెల్లప్ప కమిషన్ సూచనలు పరిగణలోకి తీసుకుని ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గట్టు తిమ్మప్ప పార్టీ మారుతుండటంతో ఎమ్మెల్సీ పదవిపై ఆయనకు హామీ లభించినట్లు సమాచారం. అయితే ఆయన కాకుండా మిగతావారు ఆ సామాజిక వర్గంలో మంచి పట్టు ఉన్న నాయకులే ఉన్నారు. వారు ఎటువైపు వెళ్తారనే విషయంలో స్పష్టత లేదు. ఇదే విషయమై గట్టు తిమ్మప్పను వివరణ కోరగా.. తాను పని నిమిత్తం రేవంత్‌రెడ్డిని కలిశానని, సీఎం మామా అని పిలిచి పార్టీలోకి ఆహ్వానించారని తెలిపారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా తమకు కాంగ్రెస్ పార్టీ తరపున న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని, అందుకే పార్లమెంట్ ఎన్నికల్లోపే కాంగ్రెస్‌లో చేరుతానని తెలిపారు. చెల్లప్ప కమిషన్ ప్రకారం తమను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తోనే కాంగ్రెస్‌లోకి వెళ్తానని అన్నారు.

మెట్టు దిగని కౌన్సిలర్లు

- వనపర్తి మునిసిపాలిటీలో అవిశ్వాసంపై బుజ్జగింపులు
- చక్కదిద్దే పనిలో మార్కెట్‌యార్డు చైర్మన్ రమేష్‌గౌడ్



తిరుగుబాటు కౌన్సిలర్లతో సమావేశమై మాట్లాడుతున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేష్ గౌడ్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 4: వనపర్తి మునిసిపాలిటీలో ముదిరిన అవిశ్వాసంపై చిక్కుముడి వీడటం లేదు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం 'మళ్లీ తెరపైకి అవిశ్వాసం' అనే శీర్షికన ప్రచురితమైన కథనంతో బీఆర్ఎస్ నాయకులు తిరుగుబాటు కౌన్సిలర్లు, చైర్మన్, వైస్ చైర్మన్‌ల మధ్య సయోధ్య కుదిర్చే పనిలో పడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేష్ గౌడ్ నివాసంలో నాయకులు సమావేశమై రాజీ కుదిర్చే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాత్రం ససేమిరా అంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. అవిశ్వాసంపై చైర్మన్, వైస్ చైర్మన్‌లు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఇప్పటికే ముడుసార్లు సమావేశం ఏర్పాటు చేసి, రాజీ కుదిర్చే చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తిరుగుబాటు కౌన్సిలర్లు అవిశ్వాసంపై నివురుగప్పిన నిప్పులా ఉన్నారు. రెండు మూడు రోజుల్లో మునిసిపాలిటీ అవిశ్వాసంపై ఏం జరుగుతుందో వేచి చూడాలి.

యువకుడి అదృశ్యం



సతీష్(ఫైల్)

గండీడ్, ఫిబ్రవరి 4 : మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి రాములు కుమారుడు సతీష్ హైదరాబాద్‌లో ఉండి చదువుకునేవాడు. సంక్రాంతి పండుగకు గ్రామానికి వచ్చాడు. జనవరి 19న హాస్టల్‌కు వెళ్తున్నాని ఇంటి నుంచి బయల్దేరాడు. ఈ నెల రెండో తేదీన జీవితంపై విరక్తి వచ్చిందని, తాను వెళ్లిపోతానని తన అక్కకు ఫోన్‌లో మెసేజ్ పంపించాడు. దాంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

కలగానే.. ఇళ్ల నిర్మాణం

- 2009 వరదలతో సర్వం కోల్పోయిన మద్దూరు గ్రామస్తులు
- నేలమట్టమైన గృహాలు
- 14 ఏళ్లుగా అమలుకాని ఇళ్ల నిర్మాణ హామీ
- భూమి చదును పేరుతో బాధితుల నుంచి డబ్బు వసూలు
- స్థలాలిచ్చి ఆదుకోవాలని విన్నపం



2009 వరదలకు పూర్తిగా ధ్వంసమైన మద్దూరులోని ఓ ఇల్లు

మానవపాడు, ఫిబ్రవరి 4: వరద బారిన పడి, సర్వం కోల్పోయిన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం మద్దూరు గ్రామస్థులకు అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చిన ఇళ్ల నిర్మాణం కలగానే మారింది. 2009 అక్టోబరు రెండో తేదీన భారీ వర్షాలకు తుంగభద్ర నది ఉప్పొంగడంతో గ్రామంలోకి వరద నీరు చేరింది. గ్రామస్థులు కట్టుబట్టలతో ఎగువ ప్రాంతాలకు చేరుకున్నారు. వరద తగ్గిన తర్వాత వచ్చిన చూస్తే ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. దిక్కుతోచని స్థితిలో ఉన్న గ్రామస్థులు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల ద్వారా ఆకలి తీర్చుకున్నారు. ఇళ్లన్నీ కూలిపోవడంతో గ్రామంలోని ఎగువ ప్రాంతంలో స్థలాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. 14 ఏళ్లుగా ఆ హామీ నెరవేరకపోవడంతో ప్రజలు వరదలో మునిగిన ఇళ్లనే సరిచేసుకుని కాలం గడుపుతున్నారు.

30 ఎకరాలు కొనుగోలు

గ్రామస్థులకు ప్లాట్లు కేటాయించేందుకు గ్రామ శివారులోని 234, 249, 250, 252 సర్వే నంబర్లలో 30 ఎకరాల భూమిని 2012 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసింది. రేషన్‌కార్డుల ఆధారంగా 515 మంది లబ్ధిదారులకు ప్లాట్లు అందించి, ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది. కాని ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.

ఎన్నికలప్పుడే హడావుడి

ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయ నాయకులు ఇళ్ల పట్టాల విషయం ముందుకు తెస్తారని, ఆ తర్వాత పట్టించుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. గ్రామంలో రెండు వర్గాలు ఎవరికి వారుగా ఏటా బాధితుల లిస్టు ఇవ్వడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. ఒక వర్గం వెళ్లి పేర్లు ఇస్తే.. మరో వర్గం వారు వెళ్లి అది తప్పుగా ఉందని, తామిచ్చిన జాబితానే కరెక్టని చెబుతున్నారని గ్రామస్థులు అంటున్నారు. ఈ క్రమంలో రెండు నెలల కిందట అదనపు కలెక్టర్ గ్రామానికి వచ్చి, గ్రామ సభ ఏర్పాటు చేసి పేర్లు ఇస్తే స్థలాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. సర్పంచ్ గ్రామ సభ నిర్వహించి, జాబితాను అధికారులకు అందించారు. అయితే గ్రామానికి చెందిన మరో వర్గం వారు.. సర్పంచ్ తమ వర్గం వారి పేర్లతోనే లిస్టు తయారు చేశారని, నిజమైన బాధితుల పేర్లు అందులో లేవని వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దాంతో నిజమైన బాధితుల పేర్లు ఇవ్వాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. లిస్టు నేటికీ తయారు కాలేదు. ప్లాట్లు వస్తున్నాయని చెప్పి ఎంపిక చేసిన 30 ఎకరాల్లో చెట్లు, రాళ్లు తొలగించేందుకు ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.ఐదు వేలు వసూలు చేశారని తెలుస్తోంది. ఈ విషయమై కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.



వరదకు ఇళ్లన్నీ నేలమట్టం కావడంతో గ్రామస్థులు ఉండేందుకు అప్పట్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గుడారం



పట్టాలిచ్చేందుకు ప్రభుత్వం కొనుగోలు చేసిన 30 ఎకరాల భూమి

కుటుంబాలు విడిపోయాయి



ఇంటి స్థలం ఇస్తామని ఇవ్వడం లేదు. గ్రామంలోని పాత ఇంటినే బాగుచేసుకుని జీవనం సాగిస్తున్నాం. వరదల వల్ల కుటుంబాలు విడిపోయి, ఇతర ప్రాంతాల్లో జీవనం కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి పట్టాలు అందిస్తే కలిసి జీవించే అవకాశం ఉంటుంది.

\- సుశీల, మద్దూర్

భయం భయంగా జీవనం



వరదల కారణంగా భయభ్రాంతులకు గురయ్యాం. అప్పటి నుంచి భయం గుప్పిట్లోనే బతుకుతున్నాం. ఇతర ప్రాంతాల్లో జీవించలేక పడిపోయిన ఇళ్లల్లోనే కాలం గడుపుతున్నాం. ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు కేటాయించాలి.

\- శీనువాసులు, మద్దూర్

ఉన్నతాధికారులకు తెలుపుతాం

మద్దూరు గ్రామస్థులకు ప్లాట్లు అందించే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలుపుతాం. వెంచర్ వేసి, ప్లాట్లు అందించే దిశగా ఏర్పాట్లు చేస్తాం.

\- జుబేర్ మొహినొద్దీన్, తహసీల్దార్

ఇష్టానుసారంగా.. ఉపాధి పనులు



పోల్కంపల్లిలో పనులకు హాజరైన కూలీలు

- నిబంధనలకు విరుద్ధంగా మెటీరియల్ పేమెంట్‌కు అధిక నిధులు వినియోగం
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెద్ద ఎత్తున వాడేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఫలితం 11 నెలలుగా నిలిచిన రూ.కోట్ల రూపాయల చెల్లింపులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 4: మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికార యంత్రాంగం నిర్లక్ష్యం, నిర్లిప్తత కారణంగా గందరగోళంగా మారుతోంది. కేవలం కూలీలకు పని కల్పించాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకంలో రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్ల జోక్యం పెరిగిపోవడంతో కూలీలకు ఇచ్చే ప్రాధాన్యం స్థానంలో మెటీరియల్ పనులు నిబంధనలకు మించి చేపడుతున్నారు. పథకం రూపకల్పన సమయంలో లేబర్ పేమెంట్ 60 శాతం, మెటీరియల్ కాంపోనెంట్ 40 శాతానికి మించి చేయకూడదనే నిబంధనలున్నాయి. 2023-24 ఎన్నికల సమయం కావడంతో పథకం కింద రాజకీయ ఒత్తిడితో ఇష్టానుసారంగా గ్రామాల్లో మెటీరియల్ పనులు చేపట్టారు. మన ఊరు-మనబడి కింద పాఠశాలల్లో అదనపు గదులు, ప్రహరీల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు వినియోగించారు. శ్మశాన వాటికలు, క్రీడా ప్రాంగణాలకు సైతం ఈ పథకం నుంచి అధికంగా నిధులు వెచ్చించారు. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలలు మిగిలి ఉండగానే 45.03 శాతం నిధులు మెటీరియల్ కోసం వినియోగించడం గమనార్హం. 2021-22 సంవత్సరంలో 47.92 శాతం, 2020-21లో 44.31 శాతం నిధులు మెటీరియల్ కోసం ఉపయోగించారు.

కేంద్రం సాఫ్ట్‌వేర్ మార్చడంతో

ఇదివరకు రాగాస్ సాఫ్ట్‌వేర్ ఉండగా గతేడాది నుంచి కేంద్ర ప్రభుత్వం రాగాస్ స్థానంలో ఎస్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను తెచ్చింది. నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించకుండా, పథకంలో లేని పనులకు నిధులు వాడితే సిస్టమ్‌లో జనరేట్ కాకుండా ఉండేందుకు ఈ సాఫ్ట్‌వేర్‌ను తెచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెటీరియల్ పేమెంట్‌కు ప్రస్తుతం సిస్టమ్‌లో చూపుతున్న 45.03 శాతం కన్నా అదనంగా నిధులు ఖర్చు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మెటీరియల్‌కు అధికంగా నిధులు ఖర్చు చేయడంతో అవి జనరేట్ అయ్యే పరిస్థితి లేకుండా పోయింది. అడ్వాన్స్‌గా పనులు చేపట్టడంతో 11 నెలలుగా మెటీరియల్ పేమెంట్ నిలిచిపోయింది. ఎస్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో పేమెంట్ అయినది మాత్రమే సిస్టమ్‌లో జనరేట్ అవుతుంది. ఈ లెక్కన పెండింగ్‌లో ఉన్న బిల్లులను కలుపుకుంటే 55 శాతం మేర మెటీరియల్ పేమెంట్‌కు నిధులు వినియోగించినట్లు స్పష్టమవుతోంది. జిల్లాలో దాదాపు రూ.10 కోట్ల వరకు చేసిన పనులకు మెటీరియల్ పేమెంట్ పెండింగ్‌లో ఉంది. సర్పంచ్‌లకు ఇదే ఇప్పుడు తలనొప్పిగా మారింది. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని వారు వాపోతున్నారు.

సీసీ రోడ్లకు నిధుల సంకటం

ఏటా ఫిబ్రవరిలో సీసీరోడ్ల పనులకు ప్రతిపాదనలు తయారు చేసి, మార్చి నాటికి రోడ్లు వేసేవాళ్లు. గ్రామాలు, మండలాల వారికి లేబర్ పేమెంట్ ఆధారంగా మెటీరియల్‌కు ఇంత ఖర్చు చేసుకోవచ్చని ఉండేది. ప్రస్తుతం అడ్వాన్స్‌గా మెటీరియల్ పేమెంట్ వినియోగించడంతో ఇప్పుడు సీసీ రోడ్లకు నిధులు మిగిలే అవకాశం లేదని తెలుస్తోంది. ఏటా మండలానికి రూ.కోటి నుంచి రూ.రెండు కోట్ల విలువల గల సీసీ రోడ్లను ఈ పథకం కింద మంజూరు చేసేవాళ్లు. ఈ పనులను నాయకులు గ్రామాలలో ఉండే తమ కార్యకర్తలకు ఇచ్చి చేయించేవాళ్లు. అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుగానే పెద్ద ఎత్తున మెటీరియల్ పేమెంట్‌కు నిధులను వినియోగించింది. దాంతో ఈ సారి సీసీ రోడ్లకు నిధుల కేటాయింపు ఇబ్బందికరమేనని తెలుస్తోంది.

కూతురిని చంపిన తండ్రి

- భార్యపై అనుమానంతో అఘాయిత్యం

బిజినేపల్లి, ఫిబ్రవరి 4 : కంటి పాపలా కాపాడాల్సిన కన్న తండ్రి కాలయముడిగా మారాడు. అభం శుభం తెలియని 14 నెలల కుమార్తెను చంపేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని రాంరెడ్డిపల్లి తండాకు చెందిన కేతావత్ తిరుపతినాయక్‌కు కీమ్యాతండాకు చెందిన శివలీల అనే యువతితో రెండు సంవత్సరాల క్రితం పెళ్లి అయింది. అప్పటి నుంచి తిరుపతినాయక్ హైదరాబాద్‌లోని మియాపూర్‌లో భార్య శివలీల, కుమార్తె శశికళ (14 నెలలు)తో కలిసి నివాసముంటున్నాడు. ఆటో నడుపుకుంటూ జీవనం గడుపుతున్నాడు. కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న అతడు, ఆమెతో నిత్యం ఘర్షణ పడుతున్నాడు. ఇది భరించలేక భార్య శివలీల మియాపూర్‌లోనే కూలీ పనులు చేసుకొని బతుకుతున్న తల్లిదండ్రుల వద్దకు చిన్నారి సహా వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో తిరుపతి నాయక్ శనివారం సాయంత్రం భార్య దగ్గరకు వెళ్లి గొడవపడ్డాడు. కుమార్తెను వెంట బెట్టుకొని తన స్వంత గ్రామమైన రాంరెడ్డిపల్లి తండాకు చేరుకున్నాడు. భార్యపై కక్ష పెంచుకున్న అతడు, ఫుల్లుగా మద్యం తాగి అర్ధరాత్రి తర్వాత చిన్నారి నోరు మూసి, గొంతు పిసికి ఊపిరి ఆడకుండా చేసి చంపేశాడు. ఆదివారం ఉదయం ఆటోలో పసిపాప మృతదేహం సహా పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. ఈ దుర్ఘటనపై భార్య శివలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్ నాయక్ తెలిపారు.



తల్లితో చిన్నారి శశికళ(ఫైల్)

పాలమూరు బీజేపీకి అండ

- మోదీని మూడోసారి ప్రధాని చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు
- కృష్ణా జలాల కోసం పోరాడింది మేమే
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

మహబూబ్‌నగర్ న్యూ టౌన్ ఫిబ్రవరి 4 : పాలమూరు ప్రజలు బీజేపీకి ఎప్పుడూ అండగా ఉంటారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలంతా నరేంద్ర మోదీని మూడోసారి ముచ్చటగా ప్రధానిని చెయ్యాలని నిర్ణయించుకున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ పదికిపైగా సీట్లు గెలుచుకుంటుందన్నారు. తెలంగాణకు నిధులు రావాలంటే మోదీ మరోసారి ప్రధాని కావాల్సిన అవసరం ఉందన్నారు. కృష్ణా జలాల విషయంలో పోరాడింది బీజేపీయేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ మాట కూడా మాట్లాడలేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్‌కు అధికారంలోకి రావడం కలేనని, రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేది లేదని అన్నారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు కావన్నారు. ఆరు గ్యారంటీలను ఎలా అమలు చేస్తారో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ ఆనాడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో గెలిపించారు తప్ప.. కేంద్రంలో గెలిపించరన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని, అవి రెండు ఎన్నటికైనా కలుస్తాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్లేనని, కాంగ్రెస్‌కు ఓటేస్తే అది ఎటూ కాకుండా పోతుందన్నారు. ప్రజలు పాలమూరు నుంచి బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ నాయకులు జితేందర్‌రెడ్డి, బంగారు శృతి, రాంచందర్‌రావు, రంతగ్‌పాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వీపనగండ్ల, ఫిబ్రవరి 4: దైవ దర్శనానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం వీపనగండ్ల సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం వీపనగండ్ల గ్రామానికి చెందిన చాకలి సంజయ్ (40) చిన్నంబాయి మండలం పెద్దదగడ గ్రామంలో ఆర్‌ఎంపీగా చేస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఆదివారం వీపనగండ్ల సమీపంలో రంగారి మైసమ్మ దేవతను చేశారు. ఈ శుభకార్యానికి హాజరైన ఆయన తిరుగు ప్రయాణంలో ఊర చెరువు సమీపంలో మూలమలుపు దగ్గర బైకు అదుపు తప్పి బీమా కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సంజయ్‌కి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య నిర్మల, కూతురు ఉన్నారు. దైవ దర్శనానికి వచ్చి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వనపర్తి ఆసుపత్రికి తరలించారు.

ఆర్థోపెడిక్ సర్జన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గద్వాల జిల్లా వాసి

- బిజ్వారం గ్రామానికి చెందిన డాక్టర్ యంగల్ తిమ్మారెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 4 : ఆర్థోపెడిక్ సర్జన్స్ సంఘం రాష్ట్ర అ ధ్యక్షుడిగా గద్వాల జిల్లా వాసి డాక్టర్ యంగల్ తిమ్మారెడ్డి ఆదివారం ఏక గ్రీవంగా ఎన్నిక య్యారు. తిమ్మారెడ్డి స్వగ్రామం మల్దకల్ మండలం బిజ్వారం. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన తొమ్మిదవ ఆర్థోపెడిక్ సర్జన్స్ రాష్ట్రస్థాయి సదస్సులో తిమ్మారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తు తం తిమ్మారెడ్డి ఉస్మానియా మెడికల్ కళాశాల, జనరల్ హాస్పటల్లో ప్రొఫెసర్‌గా, ఆర్థోపెడిక్ విభా గం అధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. గద్వాల జిల్లా కేంద్రంలో ని ప్రాక్టిసింగ్ హైస్కూల్‌లో పదవ తరగతి వరకు చదివిన తిమ్మారెడ్డి, ఇంటర్ ఎంఏఎల్‌డీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూ ర్తి చేశారు. గద్వాల జిల్లాకు చెందిన డాక్టర్ తిమ్మారెడ్డి ఆర్థోపెడిడ్ సర్జన్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక కావడంపై మల్దకల్ మండలం బిజ్వారం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



డాక్టర్ తిమ్మారెడ్డి

గజ వాహనసేవలో అభయుడు

ఊర్కొండ, ఫిబ్రవరి 4: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి వారు ఆదివారం గజ వాహనసేవలో ఊరేగారు. స్వామి వారికి అర్చకులు తెల్లవారుజామున పంచ సూక్తములతో పూజలు సహస్రనామార్చన నిర్వహించారు. స్వామివారు రాత్రి గజవాహన సేవలో ఊరేగిన అనంతరం భక్తులు భజనలు, ప్రదోశపూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలి రావడంతో బ్రహ్మోత్సవాలు అలయం పరిసరాలు కిక్కిరెసినవి. జై హనుమాన్ నామస్మరణతో మారుమోగాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, పాలకమండలి సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్సై లెనిన్ ఆద్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్‌నాయక్, గోపాల్, అశోక్, సంగప్పగౌడ్, అర్చకులు దత్తాత్రేయశర్మ, శ్రీనివాసశర్మ, ప్రవీణ్‌శర్మ, మహేష్‌శర్మ సిబ్బంది వరలక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, రవికుమార్ భక్తులు ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.



గజ వాహనసేవలో ఊరేగుతున్న అభయాంజనేయస్వామి

అనుమానాస్పదంగా మహిళ మృతి

గండీడ్, ఫిబ్రవరి 4 : మండంలోని సల్కర్‌పేట గ్రామ శివారులోని వాగు వద్ద అనుమానాస్పదంగా ఓ మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం సల్కర్‌పేటలో పలువురు రైతులు పొలం పనులకు వాగు పరిసరాల్లోకి వెళ్తుండగా మహిళ మృతదేహం కనిపించడంతో గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లి గమనించిన గ్రామస్థులు మహమ్మదాబాద్ మండలం వెంకట్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంజిలమ్మ (33)గా గుర్తించారు. అయితే, ఆమె శనివారం రాత్రే మృతి చెంది ఉండవచ్చునని భావించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఆదివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. ఎవరో హత్య చేసి, మృతదేహాన్ని ఇక్కడ పడేసి ఉన్నట్లుగా ఆనవాళ్లను బట్టి తెలుస్తోందని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేసున్నారు.


మద్యం మత్తులో తల్లిపై దాడి

- ఆపై గొంతు కోసుకున్న యువకుడు

జడ్చర్ల, ఫిబ్రవరి 4 : మద్యం మత్తులో తల్లిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, అనంతరం సదరు యువకుడు గొంతు కోసుకున్న సంఘటన జడ్చర్ల మునిసిపాలిటీలోని ఇందిరానగర్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పెయింటర్ వృత్తితో జీవనం సాగిస్తున్న నవీన్‌కుమార్ మద్యానికి బానిసయ్యాడు. ప్రతీ రోజు మద్యం తాగి వచ్చి తల్లితో గొడవపడేవాడు. ఆదివారం రోజు సైతం మద్యం తాగి వచ్చి, మళ్లీ మద్యం కోసం తల్లిని డబ్బులు ఇవ్వాలని వేధించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తల్లిపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనలో తల్లి ఇందిరమ్మకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను చికిత్స కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా తల్లిపై దాడికి పాల్పడిన నవీన్‌కుమార్, తన గొంగు కోసుకుని, రక్తం కారుతున్నా నడుచుకుంటూ పోలీస్ స్టేషన్‌వైపు వెళ్తుండగా, వెంటనే చికిత్స కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.







ఏడాదిలో అభివృద్ధి చేసి చూపిస్తాం

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి
- ధన్వాడ, మరికల్‌లో కొనసాగిన పాలమూరు న్యాయ యాత్ర

ధన్వాడ/మరికల్, ఫిబ్రవరి 4 : పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధిని ఏడాదిలో చేసి చూపిస్తామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. పాలమూరు న్యాయ యాత్ర ఆదివారం ధన్వాడ, మరికల్ మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా చల్ల వంశీచందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి ముందుగా గున్ముక్లలోని కడపరాయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర గున్ముక్ల, ఎంనోన్‌పల్లి, కంసాన్‌పల్లి మీదుగా ధన్వాడకు చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ధన్వాడలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. గంగా ఆలయంలో పూజలు నిర్వహించి, ముదిరాజ్ సంఘం నాయకులతో మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఏం సేవ చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ధన్వాడలో డివైడర్, పెద్ద చెరువుకు నీళ్లు ఇస్తానన్నారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ నియోజకవర్గం సస్యశ్యామలం చేస్తానన్నారు. అదే విధంగా మరికల్ మండలం పెద్దచింతకుంట, వెంకటాపూర్, తీలేరు, పల్లెగడ్డ, మాధవరం, మరికల్‌లో కొనసాగిన పాలమూరు న్యాయ పాదయాత్రకు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. తీలేరు మాజీ సర్పంచ్ రేవతమ్మ ఆధ్వర్యంలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మన జిల్లా బిడ్డ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలమూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు స్థానాలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఘన విజయం సాధించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ధన్వాడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నరహరి, విండో చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, చీరాల సుధాకర్‌రెడ్డి, జత్రం లక్ష్మయ్యగౌడ్, జుట్ల ఆనంద్‌గౌడ్, కందనూర్ రహిమన్‌ఖాన్, చిట్టెం సత్యారెడ్డి, అజీమోద్దీన్, నీరటి రాంచంద్రయ్య ముదిరాజ్, సంద లక్ష్మన్న, సంద నర్సిములు, కెంచె నరేందర్, కెంచె రఘువీర్, ఖదీర్‌పాష, యూసూప్, టప్ప భాస్కర్, టప్ప కృష్ణ, కెంచె జయప్రకాష్, మాజీ వార్డు సభ్యుడు శివరాములు, పూజారి నర్సిములు, అచ్చిబాబు, మరికల్‌లో వీరన్న, సూర్యమోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


ధన్వాడలో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

బాలికపై లైంగిక వేధింపులు

- బాలసదన్‌కు తరలించిన చైల్డ్ వెల్ఫేర్ అధికారులు

అమ్రాబాద్, ఫిబ్రవరి 4: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అదే గ్రామానికి చెందిన 50 ఏళ్ల పైబడిన వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆదివారం సాయంత్రం చైల్డ్ వెల్ఫేర్ అధికారులు మల్లేష్, సృజన, పావని అమ్రాబాద్ ఎస్ఐ వీరబాబు తదితరులు గ్రామానికి చేరుకొని విచారణ జరిపారు. నాలుగు రోజుల క్రితం జరిగినట్లు స్థానికులు చర్చించుకొంటున్నారు. ఈ సంఘటనపై గ్రామంలో కొంత మంది వ్యక్తులు ఈ విషయం బయట పడకుండా ప్రయత్నం చేసినట్లుగా తెలిసింది. అయినప్పటికీ బాలిక బంధువులు, మరికొందరి ద్వారా 1098 చైల్డ్ వెల్ఫేర్ హెల్ప్‌లైనుకు సమాచారం అందించడంతో ఆ గ్రామానికి చేరుకొన్న అధికారులు అచ్చంపేటలోని చైల్డ్ వెల్ఫేర్‌హోంకు బాలికను తరలించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు అందిస్తామని ఎస్ఐ వీరబాబు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

11 నుంచి పాలెం వెంకన్న బ్రహ్మోత్సవాలు

బిజినేపల్లి, ఫిబ్రవరి 4 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెంలోని అలువేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి 18 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సీహెచ్. రంగారావు ఆదివారం తెలిపారు. ఫిబ్రవరి 11న ఉదయం అభిషేకం, 13న లక్ష పుష్పార్చన, 14న ఉదయం స్వామి వారి కల్యాణోత్సవం, ఫిబ్రవరి 16న స్వామి రథోత్సవం (తేరు), 17న ఉద్దాల మహోత్సవం, 18న హోమం, పూర్ణాహుతి మొదలుగు కార్యక్రమాలతో అత్యంత వైభవంగా బ్రహోత్సవాలను ముగించనున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తుల హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాలెం విద్యాసంస్థల పునర్ వైభవానికి పాటుపడుదాం

-ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ

బిజినేపల్లి, ఫిబ్రవరి 4 : తోటపల్లి సుబ్ర మణ్యం శర్మ (సుబ్బయ్య) స్థాపించిన పాలెం విద్యాసంస్థల పునర్ వైభవానికి పూర్వ విద్యార్థులమంతా పాటుపడుదామని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పాలెంలోని వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సమావేశపు హాల్‌లో వజ్రోత్సవాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జనవరి 28న నిర్వహించిన విద్యాసంస్థల 60 వసంతాల వజ్రోత్సవాలు విజయవంతం కావడానికి కృషి చేసిన ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులను అభినందించారు. రెండు నెలల పాటు కుటుంబాలను, ఉద్యోగ, వ్యాపారాలను పక్కన బెట్టి వేలాది పూర్వ విద్యార్థులను ఒక వేదికపైకి తీసుకరావడానికి ఎంతో కష్టపడ్డారని, వజ్రోత్సవాలకు వచ్చిన పూర్వ విద్యార్థులను చూస్తేనే అర్థమయిందన్నారు. పూర్వ విద్యార్థి ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సుబ్బయ్య స్థాపించిన బడి, కళాశాలలకు పూర్వ వైభవం దిశగా ప్రతీ పూర్వ విద్యార్థి అన్ని రకాల సహాయ సహకారాలు అందించి చదువుకున్న విద్యాసంస్థల రుణం తీర్చుకోవాలని కోరారు. అనంతరం కళాశాలలోని నాన్ టీచింగ్ స్టాప్‌ను పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బుడ్డయ్య, ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు, కోశాధికారి బాలకిష్టయ్య, వజ్రోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు డాక్టర్ అనుపటి మల్లికార్జున్, అనుపటి లక్ష్మీకాంత్, కాశిరెడ్డి గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జహంగీర్, సొప్పరి కాశన్న, వంగ రామన్ గౌడ్, రవీందర్ రెడ్డి తదితరులున్నారు.


ఎస్వీ డిగ్రీ కళాశాల నాన్ టీచింగ్ స్టాప్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నీటి గుంటలో పడి బాలిక మృతి

కేటీదొడ్డి, ఫిబ్రవరి 4: నీటి గుంటలో పడి బాలిక మృతి చెందిన సంఘటన ఆదివారం గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని చింతలకుంట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. చింతలకుట గ్రామానికి చెందిన కుర్వ రాజుకు ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురు విష్ణుప్రియ(6) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నది. ఆదివారం సెలవు దినం కావడంతో తల్లిదండ్రులు, పిల్లలను పొలానికి తీసుకెళ్లారు. తల్లిదండ్రులు పనిలో నిమగ్నమై ఉండగా పెద్ద కూతురు విష్ణుప్రియ, చిన్న కూతురు మధుప్రియలు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడ్డారు. గమనించిన తల్లిదండ్రులు వెళ్లి చూడగా చిన్న కూతురు నీటిలో కనిపిస్తుండగా పెద్ద కూతురు నీటి లో మునిగిపోయి ఉంది. వెంటనే ఇద్దరు పిల్లలను కర్ణాటకలోని రాయచూరు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే పెద్ద కూతురు విష్ణుప్రియ మృతి చెంది ఉందని వైద్యులు తెలిపారన్నారు. బాలిక మృతితో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. ఈ ఘటనపై మండల ఎస్సై శ్రీనివాసరావును వివరణ కోరగా ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.


విష్ణుప్రియ

గుప్త నిధుల కోసం తవ్వకాలు


గుప్త నిధుల కోసం తవ్విన గుంత

కోడేరు, ఫిబ్రవరి 4 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రం శివారులో లక్ష్మాపూర్ అంజనేయస్వామి ఆలయ పరిసర ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. కోడేరు మండల కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో దాదాపు 150ఏళ్ల క్రితం లక్ష్మాపూర్ గ్రామంలో 50 ఇళ్లు ఉండేవి. అప్పట్లో ఎత్తం గట్టునీడ గ్రామంపై పడుతుండడంతో కీడు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారన్న అనుమానంతో గ్రామాన్ని వదిలేశారు. దీంతో ఇళ్లు శిథిలావస్థకు చేరి చెట్లు మొలిచాయి. ఆలయాలు, విగ్రహాలు, పూర్వీకులు ఉపయోగించిన వస్తువుల ఆనవాళ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. అంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన కొంత భూమి ఉంది. దానితోపాటు ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో అక్కడ గుప్త నిధులు ఉన్నట్లు కొందరు దుండగులు గతవారం రోజుల క్రితం పరిసర ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టారు. రెండు చోట్ల తవ్వకాలు చేసిన ఆనవాలు ఉన్నాయి. తవ్వకాలు జరిపిన ప్రదేశంలో నిమ్మకాలు, కుంకుమ, పసుపు వేసి పెద్దరాయిపై మంత్రాలు చేసిన ఆనవాళ్లు కన్పిస్తున్నాయి.

సమగ్ర సాగునీటి ప్రణాళిక రూపొందించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రాఘవాచారి

పాలమూరు, ఫిబ్రవరి 4 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీడు భూములకు సాగునీరివ్వటానికి సమగ్ర సాగునీటి ప్రణాళిక రూపొందించాలని వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇంజనీర్లతో కమిటీ వేయాలని కోరారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, మేధావులు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో సాగునీటి సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వం చేసిన తప్పులు కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ పాలమూరు పార్లమెంట్‌కు తీరని అన్యాయం చేసిందన్నారు. గ్రావిటీతో నీరు అందే పథకాలు ఆర్డీఎస్, జూరాల మాత్రమేనని, గత ప్రభుత్వాలు ఆర్డీఎస్ ఆనకట్టను పట్టించుకో లేదని జూరాల ప్రాజెక్టును సమర్థవంతంగా నిర్వహించలేదన్నారు. ఈ పార్లమెం ట్ పరిధిలోని సాగునీటి సమస్య పరిష్కారానికి నేటివరకు ప్రతి పాదనలో ఉన్న 2013లో విడుదల చేసిన 72 జీవో, 2014 మే నెలలో విడుదలైన 69జీవో, ఆ తరువాత ఇంజనీర్లు ప్రతిపాదిం చిన నారాయణపేట-కొడంగల్ పథకాన్ని పరిశీలించి నిపుణులైన, అనుభవం ఉన్న ఇంజనీర్లతో ఒక నివేదిక తీసుకోవాలన్నారు. సమావేశంలో విస్తృతచర్చ కోసం పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి రూపొందించి పత్రాన్ని ప్రజెంట్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాన్ని చర్చకు తెచ్చి కృష్ణానది నీటివాటా సాధన, రూ.వెయ్యి కోట్లు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి పథకంలోని 90టీఎంసీలు నీటిలో సగం నీటిని కనీసం 45 టీఎంసీలు జూరాల లోపల భీమా, కృష్ణ సంగమం నుండి తీసుకోవడం, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం తదితర పది డిమాండ్లు చర్చకు తీసుకువస్తే సమావేశం ఆమోదించిందన్నారు. మహబూబ్‌నగర్ కన్వీనర్ ఎ.తిమ్మప్ప, కేసీ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సీపీఐ పరమేశ్వర్‌గౌడ్, సీపీఎం కిల్లెగోపాల్, కాంగ్రెస్ సాయిబాబా, రైతాంగసమితి జక్కా వెంకటన్న, కుల నిర్మూలన పోరాట సమితి డి.చంద్రశేఖర్, యం.ఆర్‌జేఏసీ హనీఫ్‌అహ్మద్, టీఎప్‌టీయూ ఎస్.యం ఖలీల్, కేఏఎన్‌పీఎస్ లక్ష్మయ్య, కర్ణాటక రైతు సంఘం వీరన్న, టీజేఎస్‌పార్టీ ఆలూరు ప్రకాష్‌గౌడ్‌లు పాలకులు, ప్రభుత్వాలు తమ ఎన్నికల చదరంగం కోసం మహబూబ్‌నగర్ రైతాంగం జీవితంతో చెలగాటం ఆగుతున్నారని, ఒక హక్కుగా సాగునీరు సాధించుకుని జిల్లా భూములు రక్షించు కుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో పాలమూరు అధ్య యన వేదిక నారాయణపేట జిల్లా సుదర్శన్, వికారాబాద్ జిల్లా ర వీందర్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా కర్ణకోట రవీంద్రనాథ్, నాగర్‌కర్నూల్ జిల్లా ఎం.నారాయణ, గద్వాల జిల్లా ఎం.డి ఇక్బాల్‌పాషా, వనపర్తి జిల్లా కే.వెంకటేశ్వర్లు జిల్లాల పరిస్థితులపై ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై పత్రసమర్పణ చేశారు. లక్ష్మీనారాయణ, గోపాల్ పాటలు పాడారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు : డీఐఈవో


ప్రభుత్వ జూనియర్ కళాశాలో ప్రాక్టికల్ ఎగ్జామ్స్‌ను పరిశీలిస్తున్న డీఐఈవో

గద్వాల టౌన్, ఫిబ్రవరి 4 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని డీఐఈవో ఎం.హృదయరాజు సూచించారు. ఆదివారం గద్వాల పట్టణంలోని జూనియర్ కళాశాల కేంద్రాల్లో నాల్గవరోజు ఆదివారం కొనసాగిన ప్రయోగ పరీక్షలను డీఐఈవో పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని కేంద్రాల బాధ్యులకు సూచించారు. కాగా, ప్రాక్టికల్ పరీక్షల నాల్గవ రోజు జిల్లా వ్యాప్తంగా 33 కేంద్రాల్లో మొత్తం 394 మందికి గాను 381 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో జనరల్ సైన్స్‌కు చెందిన వారు 255 మంది ఉండగా, వృత్తి విద్య కోర్సుకు సంబంధించిన వారు 126 మంది ఉన్నారు. మిగతా 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

అయిజ, ఫిబ్రవరి 4: ఉత్తనూర్ ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అయిజ మండల పరిధిలోని ఉత్తనూర్ గ్రామంలో వెలసిన ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12వ తేది నుండి 18వరకు నిర్వహించతలపెట్టారు. దేవస్థాన కమిటీ చైర్మన్, బ్రహ్మోత్సవాల నిర్వాహకుడు పులకుర్తి గౌతమ్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దివంగత జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉత్తనూర్ తిర్మల్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని మంత్రి గుర్తు చేసుకున్నట్లు గౌతమ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రైతు సంబురాల కన్వీనర్ మందాడి చిదంబర్‌రెడ్డి, రైతు సంబురాల వ్యాఖ్యాత నరసింహారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను ఇంటి దగ్గర కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.


బోచర్ విడుదల చేస్తున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి

వేతనం ఇక్కడ.. విధులు అక్కడ

- డిప్యూటేషన్‌పై ఇతర మండలాలకు గట్టు అధికారులు
- సంవత్సరాలుగా కొనసాగుతున్న పరిస్థితి
- సిబ్బందిలేక అవస్థలు పడుతున్న గట్టు మండల పరిషత్ అధికారులు
- ఉన్న ఒక్క అధికారిపైనే పని భారం
- పట్టించుకోని జిల్లా అధికారులు

గట్టు, ఫిబ్రవరి 4: ప్రభుత్వ అధికారులు ఎక్కడ పని చేస్తే అక్కడ జీతం తీసుకోవాలి. కానీ మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మాత్రం ఎక్కడ పని చేసినా అధికారులు ఇక్కడే వేతనం చెల్లిస్తున్నారు. గద్వాల జిల్లా కేంద్రానికి సుదూరంగా ఉన్న గట్టు మండలంపై ఉన్నతాధికారులు దృష్టి సారించక పోవడంతో ఇక్కడి అధికారులు ఆడింతే ఆట పాడిందే పాటగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ డిప్యూటేషన్ల తతంగం జిల్లా అధికారుల దృష్టికి వెళ్లిందా లేదా అన్నది తెలియాల్సి ఉన్నది. ఒకే కార్యాలయంలో ఏకంగా ముగ్గురు అధికారులను డిప్యూటేషన్‌పై పంపడం చర్చనీయాంశంగా మారింది. అధికారులంతా ఇతర మండలాలకు వెళ్లడంతో కార్యాలయంలో అధికారులు లేక వెలవెలబోతున్నది. కార్యాలయంలో అధికారుల సంఖ్య తగ్గడంతో ఎక్కడి పనులు అక్కడే స్తంభిం చి పోతున్నాయి. కార్యాలయంలో తగినంత మంది సిబ్బంది లేక పోవడంతో ఉన్న ఒక్కరిద్దరు అధికారులపై పని భారం పడుతోంది. ఇంత జరుగుతున్నా వెళ్లిన అధికారుల డిప్యూటేషన్‌లను రద్దు చేయించకపోవడం ఉన్నతాధికారులు డిప్యూటేషన్లపై దృష్టి సారించకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తున్నది.

డిప్యూటేషన్‌పై వెళ్లింది వీరే..

కార్యాలయానికి సంబంధించిన పనులను ఆన్‌లైన్ చేయడంతో పాటు నోట్ ఫైల్స్, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వాటిని కంప్యూటర్‌లో క్రోడికరించడం వంటి పనులను చేయడానికి కార్యాలయంలో టైపిస్టు అవసరం ఉన్నదని మండల పరిషత్ కార్యాలయానికి ఒక టైపిస్టు పోస్టును కేటాయించి ఉద్యోగిని నియమించారు. కొద్ది రోజుల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించి అనంతరం ఆమెను ఇక్కడ అవసరం లేదనుకున్నారో ఏమో డిప్యూటేషన్‌పై ఉండవల్లి మండలానికి పంపారు. దీంతో కంప్యూటర్ ద్వారా చేపట్టే ఆన్‌లైన్ పనులతో పాటు కార్యాలయానికి చెందిన అనేక పనులు స్తంభించిపోయాయి. దాంతో బయట ప్రైవేట్ ఆపరేటర్‌తోనైనా లేదా గ్రామపంచాయతీల పనులు చేపట్టే కంప్యూటర్ ఆపరేటర్‌తో పనులు చేయించాల్సిన దుస్థితి తలెత్తిందని కార్యాలయ ఉద్యోగులు వాపోతున్నారు. అదేవిధంగా జూనియర్ అసిస్టెంట్‌ను గద్వాలకు డిప్యూటేషన్‌పై పంపారు. దాంతో కార్యాలయంలోని ఉన్న ఒక్కరిపైనే పని భారం పడుతున్నది. మరో సీనియర్ అసిస్టెంటును కేటీదొడ్డి మండలానికి డిప్యూటేషన్‌పై పంపారు. ఇలా కార్యాలయంలోని అధికారులందరిని ఇతర మండలాలకు డిప్యూటేషన్‌పై పం పినా అడిగే నాథుడు లేక పోవడంపై మండల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంపీడీవో చెన్నయ్యను వివరణ కోరగా సిబ్బంది డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఉన్న అధికారులపై పని భారం పడుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.



గట్టు మండల పరిషత్ కార్యాలయం

వంశీచంద్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకుల సంఘీభావం



సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డికి సంఘీభావం తెలుపుతున్న మండల కాంగ్రెస్ నాయకులు

చారకొండ, ఫిబ్రవరి 4: పాలమూరు న్యాయయాత్ర చేపట్టిన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డికి ధన్వాడ మండల కేంద్రంలో ఆదివారం చారకొండ మండల కాంగ్రెస్ నాయకులు పాలమూరు న్యాయయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. చల్లా వంశీచంద్‌రెడ్డితో పాటు నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, కిసాన్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర కార్యదర్శి తక్కెళ్లపల్లి శేఖర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పాలాది బాలరాజు, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, శేరిఅప్పారెడ్డిపల్లి తాజా మాజీ సర్పంచ్ రంగారెడ్డి, ఇనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, కొండల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానం కాంగ్రెస్ కైవసం

- ఓబీసీ సెల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకునమోని రాముయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆకునమోని రాముయాదవ్

కొల్లాపూర్, ఫిబ్రవరి 4 : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం తథ్యమని ఓబీసీ సెల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకునమోని రాముయాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని ఎంజీఎల్ఐ అతిథి గృహ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, పార్టీ మండల అధ్యక్షుడు మీనుగ పరుశరామ్‌నాయుడులతో కలిసి ఆకునమోని రాముయాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం మల్లురవి చేసిన సేవలు మరువలేనివని ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లోని నియోజకవర్గాల ప్రజలకు మల్లురవి కుటుంబం సుపరిచితులని వారు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు రాజకీయాలకతీతంగా మల్లురవి నేతృత్వంలో న్యాయం చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మల్లురవికి ఎంపీ టికెట్ కేటాయించాలని వారు కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంటె శివన్న, కొల్లాపూర్ పట్టణ అధ్యక్షుడు కాంతారావు, బోడబండతాండా గ్రామ పార్టీ అధ్యక్షుడు శంకర్, నడిమింటి వెంకటస్వామి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తండూలార్చన



తండూలార్చన పూజలు నిర్వహిస్తున్న బాలవికాస్ విద్యార్థులు

కందనూలు, ఫిబ్రవరి 4 : నాగర్‌కర్నూల్ జిల్లా సత్యసాయి సేవా సంస్థ ద్వారా జిల్లా కేంద్రంలోని సత్యసాయి మందిరంలో ఆదివారం శాస్త్రోక్తంగా బాలవికాస్ విద్యార్థులచే ఆదివారం తండూలార్చన ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థ కన్వీనర్ హకీం విశ్వప్రసాద్ మాట్లాడారు. నాగర్‌కర్నూల్‌లోని సత్యసాయి మందిరం, పాత మార్కెట్ శివాలయం, గ్లోబల్ పాఠశాలలో నిర్వహిస్తున్న బాలవికాస్ విద్యార్థులు, ఉయ్యాలవాడ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో నిర్వహిస్తున్న బాలవికాస్ విద్యార్థులచే సామూహికంగా ప్రత్యక్షంగా వేద మంత్రోచ్చారణలతో పూజలు ప్రారంభించి సాయి గాయత్రి అష్టోత్తర నామాలతో సామూహికంగా విద్యార్థులచే తండూలార్చన కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు వావిలాల రాజశేఖరశర్మ నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బాలవికాస్ గురువులు రాఘవేందర్, రవికుమార్, అరుణ, సువర్ణ, సుప్రజ, లలిత, సుజాత, శివమ్మ, సేవాదల్ కో ఆర్డినేటర్ కొండూరు విజయభాస్కర్, సాయి, యువత రాజు, బాలవికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ప్రహరీ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు, ఫిబ్రవరి 4: అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం సేవకుడిలా పనిచేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని చౌదర్‌పల్లిలో రూ.20 లక్షలతో మంజూరైన గ్రామపంచాయతీ, పాఠశాల ప్రహరీగోడ నిర్మాణ పనులను వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు సంక్షేమపథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో వెనకబడిన వంగూరు మండలానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తానన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. ఎంపీటీసీ రమేష్‌గౌడ్, తిర్మలయ్య, మధుకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ అంకెల్లో పెరుగుదల ఖర్చుల్లో తరుగుదల



అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

కందనూలు, ఫిబ్రవరి 4 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల్లో పెరుగుదల ఖర్చుల్లో తరుగుదలగా ఉందని, కేంద్ర బడ్జెట్‌ను పెంచాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌పై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న మాట్లాడుతూ ఫిబ్రవరి 1న కేంద్ర మంత్రి ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ దళితులకు అంకెల్లో పెరుగుదల ఖర్చుల్లో తరుగుదలగా ఉందని, దళితుల సమగ్ర అభివృద్ధి పట్ల స్పష్టత లేదని ఆయన విమర్శించారు. బడ్జెట్ తీరు చూస్తూ బడా పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తూ పేదలకు ద్రోహం చేసేదిగా ఉందన్నారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనుముగల సత్యనారాయణ, నాగపూర్ మధు, శివరాం, నరసింహ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గ్రామీణ క్రీడా ప్రాంగణాలు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 4 : గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షలు వెచ్చించి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారిపోయాయి. బోర్డులకే పరిమితం కావడంతో క్రీడాకారులు ఆటలు ఆడటానికి మైదానాలు కరువై ఇబ్బంది పడుతున్నారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటు విషయంలో అధికారులు చూపిన అత్యుత్సాహం క్రీడాకారులకు ఉపయోగం లేకుండా చేసింది. క్రీడలు ఆడుకునే ప్రదేశాలలో కాకుండా ఎక్కడపడితే అక్కడ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం ద్వారా క్రీడాకారులకు ఉపయోగం లేకుండాపోయింది. లక్షలు వెచ్చించి ఊరికి దూరంగా ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాలు చదును లేకపోవడం, పిచ్చి మొక్కలు మొలవడం, ముళ్ల పొదలు ఉండడం, కుప్పలు కుప్పలుగా పెద్దపెద్ద రాళ్లు ఉండడంతో ఆటలాడేందుకు అనువుగా లేవు. ప్రతీ గ్రామంలో కనీసం ఎకరా భూమిలో తెలంగాణ గ్రామీణ క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి కనీస సదుపాయాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గ్రామీణ క్రీడాకారులు తమలో దాగి ఉన్న నైపుణ్యాన్ని ప్రదర్శించలేక పోతున్నారు.

పలు గ్రామాల్లో స్థలాలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని ఆట స్థలాలకే క్రీడా ప్రాంగణాల బోర్డులు తగిలించి అధి కారులు ఎంతో సునాయాసంగా చేతులు దులుపుకోవ డం విశేషం. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని క్రీడా మైదానాలను ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.



తిమ్మాజిపేటలో నిరుపయోగంగా గ్రామీణ క్రీడా ప్రాంగణం

ప్రాంగణాలను అభివృద్ధి చేయాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి ఆటలు ఆడేందుకు వీలుగా సిద్ధం చేయాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మానసికొల్లాసాన్ని కలిగించే క్రీడలు ఆడేందుకు వీలుగా ఏర్పాటు చేసి మైదానాలను క్రీడలకు అనువుగా చదును చేయాలి.

- అరుణ్, కబడ్డీ క్రీడాకారుడు, తిమ్మాజిపేట

ఉపయోగంలోకి తీసుకురావాలి



గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకురావాలి. శారీరక ఎదుగుదలకు ఉపయోగపడే ఆటలు ప్రతీ వ్యక్తికి అవసరం. విద్యతోపాటుగా ఉపాధ్యాయులకు అవసరమయ్యే ఆటలు ఆడించడానికి ప్రతీ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల నియామకం చేయడంతో పాటుగా నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి గ్రామీణ క్రీడాకారులకు తోడుగా ఉండాలి.

- తూడి శ్రీనివాస్‌రెడ్డి, క్రికెట్ క్రీడాకారుడు

ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష

మన్ననూర్, ఫిబ్రవరి 4: అమ్రాబాద్ మండలం మన్ననూరు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష రాసేందుకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకొని హాల్‌టికెట్ నంబర్లను పరిశీలించుకున్నారు. కేంద్రంలో మొత్తం 408 మంది విద్యార్థులకు గాను 395 మంది హాజరవ్వగా, 13 మంది గైర్హాజరైనట్లు గురుకులం ప్రిన్సిపాల్ రూపాదేవి తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులు బంధువులతో గురుకులం ప్రాంగణం అత్యంత సందడిగా కనిపించింది.

● లింగాల: తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల ప్రతిభ కళాశాలలో 2024-2025 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన సీవోఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో నాగర్‌కర్నూల్ జిల్లా నలుమూలల నుంచి 456 మంది హాజరు కావాల్సి ఉండగా 12 మంది గైరాజర్ అయినట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి తెలిపారు. 317 మంది బాలికలు, 127 మంది బాలురు పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు, వారి వెంట వచ్చినవారితో కళాశాల ఆవరణ సందడిగా మారింది.

● వెల్దండ: మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశపరీక్ష నిర్వహించారు. వివిధ గ్రామాలనుంచి వచ్చిన విద్యార్థినులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొత్తం 264 మందికిగాను 250 మంది హాజరయ్యారు. డిపార్టుమెంటల్ అధికారి కృష్ణ, ప్రిన్సిపాల్ షకీలాసుల్తానాల పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించారు.



మన్ననూరు పరీక్ష కేంద్రం వద్ద సందడి వాతావరణం

మైసమ్మ దేవత దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 4 : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగుబంగారంగా వెలసిన నాయినోనిపల్లి మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తులు పోటెత్తారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి జిల్లాల నలు మూలలనుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 30వేల మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.

మైసమ్మ దేవతకు ఈ ఆదివారం టికెట్ల ద్వారా 66వేల 250రూపాయలు, హుండీ ద్వారా ఒక లక్ష 67వేల 30రూపాయలు మొత్తం 2లక్షల 33వేల 280 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఈవో రంగారావు తెలిపారు.

● **కలశాలు వితరణ చేసిన భక్తుడు**

మండల పరిధిలోని మహాసముద్రం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ సుగుణమ్మ కుటుంబ సభ్యులు మైసమ్మ దేవతకు కలశాలు వితరణ చేశారు. మహాసముద్రం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ సుగుణమ్మ కుటుంబ సభ్యులు లక్ష రూపాయలతో తయారు చేయించిన కలశా లను భక్తిశ్రద్ధలతో మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని ఆలయ కమిటీ సభ్యులకు అందజేసి మైసమ్మ దేవత దగ్గర పెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మైస మ్మ ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మహాసముద్రం ఉప స ర్పంచ్ సుగుణమ్మ, కుటుంబ సభ్యులు వెంకటేశ్‌గౌడ్, ప ద్మ, రాజుగౌడ్, రామకృష్ణగౌడ్, కవిత, బీఆర్ఎస్ నాయకులు నరసింహ, అశోక్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శనం చేసుకుంటున్న భక్తులు

ప్రజల జీవనోపాధిపై అనాగరిక దాడులు

కందనూలు, ఫిబ్రవరి 4 : దేశం కోసం శ్రమిస్తున్న కార్మిక, రైతుల జీవితాలు, జీవనోపాధిపై నిరంతరాయంగా అనాగరిక దాడులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్, ఏఐటీయూసీ కార్యాలయంలో నాగర్‌కర్నూల్ జిల్లా కార్మిక ఉద్యోగ సంఘాల రైతు వ్యవసాయ కార్మిక ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 16న కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా నిర్వహించే పారిశ్రామిక సమ్మెను, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరిపాలనా అధికారులను పూర్తిగా దుర్వినియోగం చేస్తూ, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజల హక్కులను కాలరాస్తోందని ప్రశ్నించే గొంతులకను అణచివేస్తుందని మండిపడ్డారు. మారేడు శివశంకర్, ఆర్.శ్రీనివాసులు, చిన్నపాగ శ్రీనివాసులు, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెరుమల్ల శంకరయ్య, ఎం.శ్రీనివాసులు, చింత ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం ఆంజనేయులు, అధ్యక్షవర్గంగా మారేడు శివశంకర్, ఆంజనేయులు, ఏఐటీయూసీ హమాలీ కార్మికులు బాలస్వామి, యాదగిరి, శివ, సెంట్రింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాలపీరు, గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.నరసింహ

ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగం

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

కందనూలు, ఫిబ్రవరి 4 : ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగమని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో ద్వితీయ నాగర్‌కర్నూల్ జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్-2024 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణ, నైపుణ్యాలను నేర్పుతుందని, ఆలోచన విధానం, ఏకాగ్రత, క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని, సెల్ఫ్ కంట్రోల్ స్కిల్స్ పెరుగుతాయని అన్నారు. కరాటే మహిళలకు ఎంతో మేలు చేస్తుందని, నేడు సమాజంలో జరుగుతున్న అకృత్యాలను ఎదుర్కొవడానికి తమను తాము కాపాడుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ప్రతీ ఒక్కరు ధైర్యవంతంగా, ధృడంగా తయారవుతారన్నారు. ఈ టోర్నమెంట్‌లో గెలిచిన విద్యార్థులకు మెడల్స్ సర్టిఫికెట్లను అందజేశారు. తైక్వాండో జిల్లా అధ్యక్షుడు తెప్ప శ్రీను, సెక్రటరీ ఎ.రవికుమార్, ట్రెజరర్ కే.స్వాతి, మాస్టర్లు రామకృష్ణ, వెంకటస్వామి, చందు, భానుప్రకాశ్, శ్రీను, పరమేశ్, శ్రీనివాసులు, క్రీడల అధికారి సీతారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

మగ్దూం మొహియుద్దీన్ జయంతి వేడుకలు

కందనూలు, ఫిబ్రవరి 4 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎస్‌టీయూ భవనంలో ఆదివారం ఎస్‌టీయూ ఫౌండర్ మగ్దూం మొహియుద్దీన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మగ్దూం మొహియుద్దీన్ ఆశయాలను సాధిస్తామని, ఉపాధ్యాయుల సమస్యల సాధనకు, సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళి, రాష్ట్ర కార్యదర్శి కే.రమేష్, నాగర్‌కర్నూల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.మధుసూదన్‌రెడ్డి, కే.సురేష్‌బాబు, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షుడు మద్దిలేటి, బిజినేపల్లి మండల అధ్యక్షుడు బాలస్వామి, జిల్లా నాయకులు రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌కు రైల్వేలైన్‌ను సాధించుకుందాం

కల్వకుర్తి, ఫిబ్రవరి 4 : ఐక్యంగా పోరాడి నాగర్‌కర్నూల్‌కు రైల్వేలైన్‌ను సాధించుకుందామని నాగర్‌కర్నూల్ రైల్వే సాధన సమితి (ఎన్ఆర్ఎస్ఎస్) సెక్రటరీ సందీప్‌కుమార్ పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలో యూటీఎఫ్ భవనంలో ఆదివారం రైల్వేసాధన సమితి ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఆర్ఎస్ఎస్ సెక్రటరీ సందీప్‌కుమార్ హాజరై అనంతరం అనుబంధ కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు.

కల్వకుర్తి డివిజన్ రైతు సమన్వయ కమిటీ ఇన్‌చార్జిగా గోవర్ధన్‌రెడ్డిని, ప్రజాసంఘాల జేఏసీ ఇన్‌చార్జిగా పెద్దయ్యయాదవ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, లెక్చరర్ల జేఏసీ ఇన్‌చార్జిగా కల్వకుర్తి పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు సదానందంగౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా పొలిటికల్ జేఏసీ ఇన్‌చార్జిగా అరవిందాచారి, రైతు సమన్వయ కమిటీ నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జిగా రాములుయాదవ్, ఉపాధ్యాయ, సీపీఎస్ ఉద్యోగుల ఇన్‌చార్జిగా లక్ష్మీనరసింహ, మేధావుల కమిటీ ఇన్‌చార్జిగా ఐతోల్ రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు బాలశంకర్‌లను నియమించినట్లు సందీప్‌కుమార్ తెలిపారు. అన్ని సంఘాలు ఐక్యంగా ముందుకు సాగి రైల్వేలైన్ సాధించుకుందామని ఆయా సంఘాల నాయకులు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఆర్ఎస్ఎస్ సెక్రటరీ సందీప్‌కుమార్

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆసుపత్రి ఆవరణలో ధర్నా చేస్తున్న స్వీపర్లు

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 4: పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిలో పనిచేస్తున్న స్వీపరలకు పెడింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే పరిష్కారించాలని సీఐటియూ జిల్లా నాయకులు మల్లేష్ అన్నారు. స్వీపర్ల సమస్యలు వేంటనే పరిష్కరించాలని ఆదివారం పట్టణంలోని సివిల్ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేస్తున్న స్వీపర్లు పస్తులు ఉండి పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వీపర్లను నియమించుకున్న ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. జిల్లా వైద్యాధికారులు స్పందించి స్వీపర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మార్కెట్‌ను పరిశీలించిన నాయకులు



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 4 : కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ను రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు ఆదివారం పరిశీలించారు. మార్కెట్‌యార్డులో వేరుశనగకు తూకం వేస్తున్న అన్ని కాంటాలను రైతులతో కలిసి పరిశీలించారు. తూకాల్లో మోసం జరగకుండా చూడాలని, రైతులకు డబ్బులు సకాలంలో చెల్లించాలని ఆయా సంఘాల నాయకులు మార్కెట్ కార్యదర్శిని కోరారు. బీసీ సంఘం నాయకులు పెద్దయ్యయాదవ్, రాములుయాదవ్, భారతీయ కిసాన్ సంగ్ నాయకులు పసుల గోవర్ధన్‌రెడ్డి, రామస్వామి, రైతులు బాలస్వామి, తాండ్ర లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న గ్రామ యువకులు

తెలకపల్లి, ఫిబ్రవరి 4 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ దవాఖాన సిబ్బంది ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 23మంది గ్రామ యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రక్తదానం చేసిన అనంతరం మాట్లాడుతూ రక్తదానం చేయాలన్న ఆలోచన రావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని ఈ ఆలోచన వచ్చి నిర్వహించిన బోయరాజుకు అభినందనలు తెలిపారు. బాష, రమేష్, లక్ష్మణ్, అడ్వకేట్ రాము, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కోడేరు, ఫిబ్రవరి 4 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.కురుమూర్తిని కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐగా కురుమూర్తి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు నిర్వర్తించడానికి గాను పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని జగదీశ్వర్‌రావు, ఆది దానయ్య, ఆదిరాజు, ఆదిశరత్, ఎరుకలి వల్లయ్య, దూరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 4 : వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడపరాదని మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లి సమీపంలో వాహనాలను ఆయన తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హోంగార్డులు తదితరులు ఉన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం'

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 4 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వంగ భాస్కర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించిన తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిలు శ్రీసురభి ద్వివేది, ఖలీద్‌లను ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుంటామని వారు పేర్కొన్నారు.

సీఎంను కలిసిన సింగిల్‌విండో డైరెక్టర్



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కోడేరు సింగిల్ విండో డైరెక్టర్ నడుంపల్లి మహేశ్వర్‌రెడ్డి

కోడేరు, ఫిబ్రవరి 4 : కోడేరు మండల కేంద్రానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ నడుంపల్లి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి మండల అభివృద్ధి గురించి మాట్లాడినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి ఎక్కువగా నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. అందుకు రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

7న మంత్రి జూపల్లికి సన్మానం

కొల్లాపూర్, ఫిబ్రవరి 4 : తెలుగు తెనుగు ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం 10గంటలకు పట్టణంలోని మైబూబ్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు సన్మానం నిర్వహించనున్నట్లు ముదిరాజ్ ఉద్యోగుల సాంస్కృతిక సమైక్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జూపల్లి రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.